


రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0 (సోమవారం)
కనిష్ఠం : 28.0





షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు చిత్రంలో మంత్రి దుర్గేష్, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల, బత్తుల, వాసు, ఎమ్మెల్సీ సోము

షైనింగ్ స్టార్స్ స్ఫూర్తిగా నిలవాలి

విద్యార్థుల సత్కార సభలో మంత్రి నిమ్మల



కార్యక్రమానికి హాజరైన చిన్నారులు.. ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు గోరంట్ల, బత్తుల, వాసు

రాజమహేంద్రవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంట ర్మీడియట్ పరీక్షల్లో జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన 169 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్-2025 పేరుతో రాజమహేంద్రవరం నారాయణదాస సవా సమితిలో నిర్వహించిన సత్కార కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యకు అత్యధికంగా నిధులు మంజూరు చేస్తూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోందన్నారు. విద్య శ్రమ,క్రమశిక్షణతోనే అలవడుతుందని చెప్పారు. షైనింగ్ స్టార్ సత్కారం తొలి మెట్టుగా భావించి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 5088 మంది విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్నామన్నారు. మానవ వనరుల అభివృద్ధి మంత్రి లోకేశ్ రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ప్రతి విషయంలోనూ దూరదృష్టితో వ్యవహరిస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం, మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కం దుల దుర్గేష్ మాట్లాడుతూ హార్డ్ వర్క్‌కి బదులుగా స్మార్ట్ వర్క్ అవసరమని అన్నారు.షైనింగ్ స్టార్స్ తమకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ప్రజాసేవలో తమకు కూడా ప్రతిభా పురస్కారాలు దక్కాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో రూ.2 బిలియన్ల ఎకానమీ సాధించడానికి, 5 వేల ఉద్యోగాలు కల్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. పది ఫలితాల్లో గత ఏడాది 23వ స్థానంలో ఉన్న జిల్లాను ఈసారి 6వ స్థానానికి తీసుకెళ్లడం హర్షణీయమన్నారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ షైనింగ్ స్టార్ సత్కారం తొలి మెట్టుగా భావించి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యా జీవితంలో విజయ పరంపర కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అవకాశాలు అందిపుచ్చుకొని ఎదుగుదలకు బాటలు వేసుకోవాలన్నారు. విద్యలో స్పర్థ, వ్యాపారంలో వైరం ఉండాలని అంటారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. విద్యా ద్వారానే సమానత్వం సిద్ధిస్తుందన్నారు. ఓ బాలిక ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూపులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలోనే నిలిచి తన వద్దకు

- పది,ఇంటర్ విద్యార్థులకు సత్కారం
- జిల్లాలో 169 మంది స్టార్స్
- నగదు,ప్రశంసాపత్రం అందజేత
- ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యం
- స్మార్ట్ వర్క్ అవసరం : మంత్రి దుర్గేష్

రాగా.. ఆమె ప్రైవేటు కళాశాల విద్యార్థి అనుకున్నానని.. కానీ నిడదవోలు ప్రభుత్వ కళాశాల విద్యార్థి అని చెప్పారు.ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది ఒక రుజువని పేర్కొన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిన రంగాల్లో విద్యారంగం కూడా ఒకటన్నారు. చివ రికి బెల్టులపై కూడా జగన్ పేరు రాసుకునే వారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ వంటి మహనీయుల పేర్లతో విద్యా ర్థులకు మంచి మెసేజ్‌ను ఇస్తోందన్నారు. హాస్టళ్లలో ఫలితాలు మెరుగు పడాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలను ఉచితంగా కల్పిస్తున్నారని.. ప్రైవేటు పాఠశాలల్లో చేరి డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేసిన ఘనత నాటి ప్రధాని వాజ్‌పేయికి దక్కుతుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు.అవార్డులు పొందిన విద్యార్థులు మరింత మందికి స్ఫూర్తి దాయకంగా నిలవాలన్నారు.ఈ కార్యక్రమంలో జేసీ చిన్న రాముడు, కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత, డీఈవో కె.వాసుదేవరావు, ఆర్‌జేడీ జి.నాగమణి, ఆర్ఐవో నరసింహం,తల్లిదండ్రులు,టీచర్లు పాల్గొన్నారు.




తమ స్టార్స్ ఫొటోలు తీసుకుంటున్న తల్లులు

వినతుల రికార్డు!

గత ఐదేళ్లూ ప్రజల పరేషాన్



గత వారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ వద్ద అర్జీదారుల క్యూ(ఫైల్)



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)
రేషన్‌కార్డులకు క్యూకడుతున్నారు.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవలే కొత్త రేషన్‌కార్డులకు దర ఖాస్తులు ఆహ్వానించింది.ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల మంజూరు, అదనంగా కుటుంబ సభ్యు లను చేర్చాలంటూ భారీగా దరఖాస్తులు పోటె త్తుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎడాపెడా కార్డుల్లో కోత, అడ్డగోలుగా రద్దు.. కొత్తవారిని చేర్చకపోవడంతో వేలాది మంది నరకయాతన పడ్డారు.ప్రభుత్వం మారాక కార్డు దారులపై సీఎం చంద్రబాబు కరుణ చూపారు. ఆరేళ్ల తర్వాత అవకాశం దక్కడంతో జనం నుం చి భారీగా వినతులు వెల్లువెత్తుతున్నా యి. ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఏకంగా 1,27,533 మంది అర్జీలు పె ట్టుకున్నారు. కొత్తకార్డులకు 10,555 మంది, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చాలం టూ 97,886 మంది విజ్ఞప్తులు చేశారు. అత్యధి కంగా తూర్పు నుంచి 43,189 దరఖాస్తులు వచ్చాయి.

అప్పుడంతా అరాచకమే..

వైసీపీ ఐదేళ్ల పాలన..సంక్షేమ పథకాల అమల్లో కోతలే కోతలు అన్నట్టు సాగింది. రకరకాల నిబంధనలతో రేషన్ కార్డులను వేలల్లో ఏరేసింది. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 16.50 లక్షల రేషన్‌కార్డులుండగా అందులో తెల్లకార్డులు 15.69 లక్షలు ఉండేవి. వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించిన అప్పటి ప్రభుత్వం అమరావతి నుంచి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లా పౌరసరఫరాలశాఖకు పంపి గుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి అం దరి కార్డులు రద్దు చేయాలని ఆదేశించింది. ప్రధానంగా 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో రద్దుచేశారు. వాస్తవానికి వీరంతా పొట్టకూటి కోసం హైదరాబాద్,విజయవాడ,చెన్నై,ఢిల్లీ తదితర ప్రాంతాలకు తాత్కాలిక వలస వెళ్లినవారే. ప్రజ లు అప్పట్లో నిర్వహించిన స్పందనలో కార్డుల్లో మార్పులు చేర్పులు, కొత్తవి మంజూరు చేయాలంటూ అనేకసార్లు భారీగా వినతులు ఇచ్చారు.అయినా జగన్ సర్కారు చెవికెక్కిం చుకోలేదు. దీంతో అప్పట్లో ప్రతిపక్ష హోదాలో టీడీపీ ఆందోళన బాట పట్టింది. కార్డులను అడ్డగోలుగా ఏరివే యడంపై నిరసనలు చేపట్టింది. ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను గుర్తుంచుకుని పరిష్కారం కోసం ఆలోచించారు. పౌరస రఫరాలశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్డుల్లో మార్పులు,చేర్పులు చేప ట్టడానికి పచ్చజెండా ఊపారు. గత నెల 14 నుంచి సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డులకు అర్జీలు స్వీకరి స్తున్నారు. రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులకు ఏడు రకా ల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.ఆరేళ్ల తర్వాత అవకాశం రావడంతో ప్రజలు క్యూకడుతున్నారు.

- రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ
- ఉమ్మడి తూ.గో.జిల్లాలో ప్రజల క్యూ
- 1.27 లక్షల దరఖాస్తులు
- కొత్తకార్డులకు 10,555
- సభ్యులను చేర్చాలంటూ 97,886
- వైసీపీ పాలనలో నో ఛాన్స్
- ప్రస్తుత ప్రభుత్వంలో అవకాశం
- భారీగా వెల్లువెత్తుతున్న విజ్ఞప్తులు

అత్యధికం అవే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకు 1,27,533 మంది నుంచి వినతులు వచ్చాయి.అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చా లంటూ కోరినవే ఎక్కువ.ప్రధానంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి అత్యధికంగా 43,189 అర్జీలు వచ్చాయి. వీటి లో రేషన్ కార్డుల్లో తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలంటూ 32,942 మంది మొర పెట్టుకున్నారు.బియ్యం కార్డులు విభజించాలంటూ 3,302 మంది, 3,684 మంది కొత్త కార్డులు కావాలని అర్జీలు అందించారు. కాకినాడ జిల్లాలో మొత్తం 42,805 మంది వినతులు అందించారు.ఇందులో కొత్తకార్డులు మంజూరు చేయాలని 3,526 మంది, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చాలని 32,852 మంది దరఖాస్తు చేసుకున్నారు. కోనసీమ జిల్లా లో మొత్తం 41,539 దరఖాస్తులు వచ్చాయి.వీటిలో అత్య ధికంగా కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చాలని 32,092 మంది,కొత్త కార్డులకు 3,345 మంది దరఖాస్తు లు చేశారు.ఇలా వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలన చేయనున్నారు. సచివాలయాల స్థాయిలో వీఆర్వోల నుంచి తహశీల్దార్ల వరకు అయా అర్జీలను విభాగాల వారీగా పరిశీలించి మార్పులు,చేర్పుల ప్రక్రియ చేపట్టనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు గడువు లేదని నిరంతరం కొనసా గిస్తామని కార్డుదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చే మాట చెప్పింది.

అర్జీ విభాగం	కాకినాడ	తూగోజీ	కోనసీమ
కార్డుల్లో చిరునామా మార్పు	1,447	1501	1387
ఆధార్‌సీడింగ్‌లో తప్పుల దిద్దుబాట్లు	368	387	356
కొత్తగా సభ్యులను చేర్చడం	32,852	32,942	32,092
కొత్తకార్డుల మంజూరు	3,526	3,684	3,345
కార్డుల తొలగింపు	1,294	1,348	1,154
బియ్యంకార్డుల విభజన	3,296	3,302	3,187
రేషన్‌కార్డుల సరెండర్	22	25	18
మొత్తం	42,805	43,189	41,539





డీవీఏపీ యూనిట్ ప్రారంభిస్తున్న మంత్రులు నిమ్మల, దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, నన్నయ వీసీ ప్రసన్న శ్రీ, వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

ఇన్నోవేటివ్‌గా ఆలోచించండి.. సమస్యలు పరిష్కరించండి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి ఇన్నోవేటివ్‌గా ఆలోచించి సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుడదామని సీఎం చంద్రబాబు సూచించారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం తూర్పుగోదావరి జిల్లా స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయం (డీవీఏపీ యూనిట్)ను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో సమస్య ఉందని వాటన్నింటిని వెలికి తీయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో వనరులు సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. స్వర్ణాంధ్ర విజన్ -2047లక్ష్యాల సాధనలో భాగంగా ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రాధాన్యత అంశాలను ప్రాతిపదికగా తీసుకుని క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు చేయాలన్న సీఎం సూచనలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఎక్కడెక్కడ ఏ సమస్యలు ఉన్నాయో గుర్తించి తదనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విద్యార్థుల ద్వారా ప్రతిపాదించే నూతన ఆవిష్కరణలకు ఆర్థిక, సాంకేతిక చేయూతనిచ్చే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏపీ యువతకు వరం అన్నారు.రాజానగరంలో 300 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలం అందుబాటులో ఉందన్నారు.ఏపీలో పర్యాటకరంగ అభివృద్ధికి అవకాశం ఉందన్నారు.వీడియోకాన్ఫరెన్సులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు.

- డీవీఏపీ యూనిట్ ప్రారంభం
- వర్చువల్‌గా చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాపై సమీక్ష
- ప్రణాళిక రూపొందిస్తామన్న మంత్రి

జిల్లా పీజీఆర్ఎస్‌లో 159 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన జీపీఆర్ఎస్‌లో 159 అర్జీలు స్వీకరించినట్టు జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పీజీఆర్ఎస్ నిర్వహించామన్నారు. ప్రజల సమస్యల పరిష్కార దిశలో మెరుగైన పనితీరు చూపాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ అంకితభావం, జవాబుదారి తనంతో సేవలందించాలన్నారు. అర్జీదారుల సంతృప్తే కొలమానంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చితమ సమస్యలను అధికారులకు అందించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 24 అర్జీలు

రాజమహేంద్రవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 24 అర్జీలను స్వీకరించి చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలు సమస్యలపై అక్కడికక్కడే స్టేషను బాధ్యులతో మాట్లాడి సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు,ఎస్‌టీ డీఎస్పీ సుబ్బరాజు పాల్గొన్నారు.

పోలీసులకు యోగా అవసరం : ఎస్పీ



రాజమహేంద్రవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో ఒత్తిడి,ఆందోళన నుంచి ఉపశమనం పొందవచ్చని ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ, పోలీసు అధికారులు, సిబ్బంది యోగా సాధన చేశారు.ఎస్పీ మాట్లాడుతూ యోగా అలవాటుగా చేసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు.వయసుతో నిమిత్తం లేకుండా యోగా సాధన చేస్తే ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవచ్చని చెప్పారు.యోగాకు నిత్యం అరగంట సమయాన్ని కేటాయించాలన్నారు. పోలీసు ఉద్యోగం నిత్యం ఒత్తిడితో కూడుకున్నదని, దానిని అధిగమించ డానికి యోగా మంచి మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు, అర్జున్, చెంచి రెడ్డి, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ మాఫియాపై కదలిక

డీజిల్ మాఫియాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు..నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలోని బంకులో సోమవా రం ప్రత్యక్ష తనిఖీలు చేపట్టారు.. నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు..

7



బంకులో ట్యాంకర్ పరిశీలిస్తున్న అధికారులు

11 నుంచి బస్‌పాస్‌లు జారీ

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జూన్ 11వ తేదీ నుంచి విద్యార్థులకు రాయితీతో కూడిన బస్ పాసులు జారీ చేయడం జరుగుతుందని ఆర్టీసీ జిల్లా అధికారి వై.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.2025-26 విద్యాసంవత్సరానికి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, గోకవరం, నిడదవోలు డిపోల్లో రోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ బస్సుపాసులు జారీ చేస్తారన్నారు.

రుడా వైస్ చైర్మన్‌గా జేసీ

రాజమహేంద్రవరం, జూన్9(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (రుడా) వైస్‌చైర్మన్‌గా జేసీ ఎస్. చిన్న రాముడు నియమితులయ్యారు. ఆయనకు పూర్తి అదనపు చార్జీని అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ ఇన్‌చార్జిగా ఉన్న సంగతి తెలిసిందే.

జిల్లా సహకార అధికారిగా వెంకటరమణ

జిల్లా సహకార అధికారిగా ఎం. వెంకటరమణ నియమితులయ్యారు. అయన ఇప్పటి వరకూ పల్నాడు జిల్లా నరసరావుపేట డీసీవోగా పనిచేస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఖాళీగా ఉండడంతో ఇక్కడకు బదిలీ చేశారు. రాజ మహేంద్రవరం మునిసిపల్ రీజియన్ డైరెక్టర్ పరిధిలో 71 మంది బదిలీ అయినట్టు ఆర్‌డీ నాగ నరసింహారావు తెలిపారు.

కొవ్వూరు ఏఎంసీ సెక్రటరీగా శ్రీనివాసరావు

కొవ్వూరు : కొవ్వూరు ఏఎంసీ సెక్రటరీగా ఎస్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన టి.శ్రీనివాసులు కరప ఏఎంసీ సెలక్షన్ గ్రేడు సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దుగ్గిరాల సెలక్షన్ గ్రేడు సెక్రటరీగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావు కొవ్వూరు బదిలీపై రానున్నారు.

ప్రభుత్వ బోధనాసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కెన్నడీ

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా న్యూరో విభాగం హెచ్‌వోడీ డాక్టర్ రాజశేఖర్ కెన్నడీ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ సోమవారం నుంచి 65 రోజులపాటు వ్యక్తిగత లాంగ్ లీవ్‌పై వెళ్లారు.డాక్టర్ కెన్నడీ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారని డీఎంఈ అధికారులు తెలిపారు.



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, కలెక్టర్, ఎమ్మెల్యేలు

శెహబాస్.. స్టూడెంట్స్

ప్రభుత్వ పాఠశాల, కళాశాలల విద్యార్థులకు మంచి మార్కులు వస్తే.. పాఠశాలలో తప్ప.. జిల్లా కేంద్రాలకు పిలిచి అభినందించడం ఎప్పుడైనా చూశామా.. ఎక్కడైనా విన్నామా.. సాక్షాత్తూ మంత్రులే వచ్చి వెల్‌డన్ అంటూ దీవించి మీకు మేమున్నాం.. చదువుకోండంటూ మాట ఇచ్చిన ఘటనలు ఉన్నాయా.. గతంలో ఎప్పుడూ లేవు.. తాజాగా కూటమి ప్రభుత్వంలో కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో సుమారు 505 మంది విద్యార్థులను అభినందించారు. ఒక్కొక్కరికీ రూ.20 నగదు.. మెడల్‌తో ప్రశంసాపత్రం అందించి ఘనంగా సత్కరించారు.. ఇది చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందించారు.



మాది నాణ్యత కలిగిన పాలన.. బ్యాగ్‌లతో మంత్రి నిమ్మల





విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఆర్డీవో మాధవి

కాకినాడలో విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్ మోహన్, ఎమ్మెల్యే కొండబాబు

శుభకార్యాలకు విరామం

నేటి నుంచి మూఢం, 26 నుంచి ఆషాఢ మాసం

పెద్దాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వివాహ సీజన్ జనవరి 30 నుంచి జూన్ 7 వరకు జోరుగా సాగింది. ఈ నెల 10వ తేదీ నుంచి గురు మౌఢ్యమి, 26న ఆషాఢ మాసం ప్రారంభం కానుండడంతో వివాహాది శుభకార్యాలకు 48 రోజుల పాటు విరామమే.



దీంతో శుభకార్యాల్లో సందడి చేసే డోలు, సన్నాయి మూగబోనున్నాయి. మాంగల్యం తంతునానేన అంటూ పెళ్లి మంత్రాలు చదివే పురోహితులు మౌన వ్రతం చేపట్టాల్సిందే. వంట మేస్త్రీలు, పుష్పాలంకరణ చేసేవాళ్లు, క్యాటరింగ్ సిబ్బంది, లైటింగ్, డెకరేషన్ వారు, కల్యాణ మండపాల యజమానులు విశ్రాంతి తీసుకోవాల్సిందే.

ఈ నెల 10 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు గురు మౌఢ్యమి కావడంతో వివాహాది శుభకార్యాలు జరగవని కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన ప్రముఖ జ్యోతిష సిద్ధాంతి చింతా గోపీశర్మ సిద్ధాంతి తెలిపారు. ఈ జ్యేష్ఠ మాసంలో మూఢమి రాకుంటే మరో 15 రోజులు వివాహాది శుభకార్యాలు జరిగేవన్నారు. ఆ తర్వాత ఆషాడం శూన్య మాసం కావడంతో శ్రావణమాసంలో వచ్చే నెల 26వ తేదీ నుంచి వివాహాలు, ఇతర శుభకార్యాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

శుభ ముహూర్తాలు ఇవే...

జులై: 26, 30, 31

ఆగస్టు: 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17

సెప్టెంబరు: 23, 24, 26, 27, 28

అక్టోబరు: 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29, 30, 31

నవంబరు: 1, 2, 4, 7, 12, 13, 14, 15, 22, 23, 25, 26, 27


అమలాపురంలోని ఓ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న మహిళ

(అమలాపురం టౌన్-ఆంధ్రజ్యోతి)

మా అమ్మాయిని చూసుకోవడానికి అబ్బాయి తరపు వారు వచ్చారు. అన్నీ బాగానే ఉన్నాయి కానీ పిల్ల కాస్త బొద్దుగా ఉందని చెప్పి వెళ్లిపోయారని ఓ తండ్రి ఆవేదన. ఇలా ఎందుకు జరుగుతోందంటూ ఎక్కడ చూసినా ఒకటే చర్చ. దాంతో ఎందరో పెద్దలు మా చిన్నతనంలో... అంటూ సాగదీస్తూ అలనాటి ఆరోగ్య చిట్కాలను చెప్తుతున్నారు.

'ఫిట్‌నెస్' మంత్ర

- అందంతో పాటు ఆరోగ్యాన్నిచ్చే వ్యాయామం
- జిమ్‌ల బాట పడుతున్న యువతులు, మహిళలు


రిమ్... జిమ్ అంటున్న యువతి

నేడు ఇల్లు, వాకిలి నడుం వంచి తుడవాల్సిన పనిలేదు. బట్టలు బండకేసి బాదక్కర్లేదు. మినపప్పు రోలులో వేసి రుబ్బాల్సిన అవసరమూ లేదు. అన్నిటికీ యంత్రాలు వచ్చేశాయి. ఇవన్నీ ధనికుల ఇళ్లకు మాత్రమే పరిమితమనుకుంటే పొరపాటే. మధ్య తరగతి ఇళ్లల్లో కూడా మిషన్లు వచ్చి చేరిపోయాయి. దాంతో ఎందరో మహిళలకు, యువతలకు దైనందిన జీవితంలో కొనసాగుతూ వచ్చిన నిత్య వ్యాయామం తగ్గిపోయింది. దానికి తోడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు కంప్యూటర్లకు మాత్రమే పరిమితమయ్యే పనులు చేసే ఉద్యోగాల సంఖ్యా పెరిగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల మాదిరిగానే పాస్ట్‌ఫుడ్ సెంటర్లు కూడా అంతే వేగంగా పెరుగుతూ వచ్చాయి. ఒళ్లు వంచి పనిచేసే ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఆధునిక యువతులు, మహిళలు ఎందరో ఊబకాయంతో బాధపడుతున్నారు.

మూడు దశాబ్దాల క్రితం వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో హనుమాన్ వ్యాయామశాలలు మాత్రమే ఉండేవి. అవికూడా 90శాతం మేర పురుషులకే పరిమితమయ్యేవి. కాలక్రమంలో వచ్చిన మార్పులతో అత్యాధునిక జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఆయా జిమ్‌ల్లో ప్రత్యేక శిక్షణలు పొంది నాజూకుగా తయారవ్వాలనే వారి సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతూ వస్తోంది.

అందం చెక్కుచెదరకుండా..

అందమే ఆనందం... ఆనందమే జీవిత మకరందం.. అన్నాడో సినీ కవి. వయసులో ఉన్నా, వయసు మీరినా అటువంటి అందాన్ని చెక్కు చెదరకుండా ఉంచుకునేందుకు నేటి తరం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఇందుకోసం మహిళలు, యువతులు పోటీపడుతున్నారు. కొందరు ఆరోగ్యంకోసమైతే, మరికొందరు ఫిట్‌నెస్ కోసం, ఇంకొందరు అందం కోసం. ఎవరి పాలసీ ఏదైనా అందరూ నేడు జిమ్‌ల వైపు పరుగులు పెడుతున్నారు. కాలం మారిందీ షైనరూ.. ఇక తగ్గాలి మీ జోరు.. అని సినీ కవి అన్నట్టుగా యువతులు యువకులతో పోటీపడుతూ శరీర సౌష్టవాన్ని కాపాడుకుంటున్నారు.


వ్యాయామ సాధనలో....

అన్ని సమస్యలకూ ఒకే రకం వ్యాయామం పనికిరాదు. ఒక్కో సమస్యకు ఒక్కో రకం వ్యాయామం ఎక్కువ ఫలితాన్నిస్తుంది. సమస్యలను బట్టి వ్యాయామాలను ఎంచుకుంటూ ఆరోగ్యాన్ని, అందాన్ని కాపాడుకోవచ్చునని వ్యాయామశిక్షకులు చెప్తున్నారు. మెరుపుతీగలా ఉండాలని యువతి కోరుకుంటుంది. కానీ ఆధునిక తిండ్లకు అలవాటుపడడంతోపాతికేళ్లకే ఒళ్లు కదిలించలేనంత లావుగా తయారవుతున్నారు. మరికొందరైతే చిరుప్రాయం నుంచే ఊబకాయం సమస్యతో బాధపడుతున్నారు. వ్యాయామంతో పాటు అందుకు తగిన ఆహారం తీసుకుంటే ఊబకాయం నుంచి బయటపడవచ్చు. ఇటీవలి కాలంలో మహిళలు, యువతులు స్కిప్పింగ్‌తో శరీర సౌష్టవాన్ని కాపాడుకునే ప్రయత్నం ఇంటినుంచే చేస్తున్నారు. మరికొందరైతే ఇళ్లల్లోని గదులను జిమ్‌లుగా మార్చేసుకుని వ్యాయామాలు చేస్తున్నారు.

మహిళలకు ప్రత్యేకం

ఏ జిమ్‌కు వెళ్లినా మహిళలకు ప్రత్యేక విభాగాలు ఉంటున్నాయి. మహిళలు, యువతులు ప్రధానంగా ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. జిమ్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలతో వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గడంతో పాటు స్టామినా పెంచుకుంటున్నారు. వ్యాయామాల ద్వారా శరీరంలో పేరుకుపోయిన కొవ్వు తగ్గించుకోవడంతో పాటు సర్వసాధారణంగా మారిన బీపీ, గుండె పల్స్ రేటును నియంత్రించుకునేవిధంగా వివిధ రకాల వ్యాయామాలు చేస్తున్నారు. జిమ్‌లలో అత్యాధునిక పరికరాల ద్వారా వ్యాయామం చేయడం వల్ల శరీరం మృదువుగా మారుతుంది. మహిళలకు ప్రధానంగా స్విస్‌బాల్, ఎలిప్టికల్ ట్రైనర్, ట్రెడ్‌మిల్లర్, అప్ రైట్ బైక్, రెక్యుంబెంట్ బైక్, డబుల్ ట్విస్టర్, హైపర్ ఎక్స్‌టెన్షన్, రబ్బర్ డంబుల్స్, స్టీమ్‌బాత్, బ్లడ్ సర్క్యులేషన్ మిషన్, స్టిక్కింగ్, స్కిప్పింగ్, బాడీ స్ట్రెచింగ్ వంటివి ఎన్నో ఉన్నాయి.



ఒకప్పుడు ఇంటి పనులే మహిళలకు అన్ని రకాల వ్యాయామాలు (ఎక్సర్‌సైజ్‌లు)గా పనిచేసేవి. కాలం మారింది. పనులన్నీ యంత్ర పరికరాలే చేసుకుపోతుండటంతో మహిళలకు వ్యాయామం తప్పనిసరి అయ్యింది. జిమ్‌లవైపు వెళ్లలేని సాధారణ మహిళలు సైతం ఉదయం, సాయంత్రం వేళల్లో నడక వ్యాయామానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక మహిళా ఉద్యోగులెందరో జిమ్‌లలో తమ శరీరానికి సరిపడా వ్యాయామాలను ఎంచుకుని ఓ వైపు ఫిట్‌నెస్‌ను.. మరోవైపు ఆరోగాన్ని కాపాడుకుంటున్నారు. అందుకే ఒకప్పుడు పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఫిట్‌నెస్ జిమ్‌లు నేడు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తున్నాయి. లింగ, వయో బేధాలు లేకుండా అందమైన శరీరాకృతిని నిలుపుకునే ప్రయత్నమే అందరిదీ. ఆధునిక సమాజంలో నిత్యం ఒత్తిళ్లకు లోనవుతున్న యువతులు, మహిళలు, విద్యార్థినులు యోగావైపు దృష్టిసారిస్తున్నారు. యోగాలోని పలు ఆసనాలను తమకు అనుకూలంగా మలుచుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు.


చిక్కాలంటే... తప్పదు మరి





90 రోజులు క్రమం తప్పకుండా చేయాలి

కంకిపాటి వెంకటేశ్వరరావు, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ కోచ్, అమలాపురం

ఫిట్‌నెస్ నిలుపుకోవాలంటే ఎటువంటి వ్యాయామమైనా 90 రోజులు క్రమం



తప్పకుండా చేయాలి. వ్యక్తి తీసుకునే ఆహారంలోని క్యాలరీలను ఖర్చు చేయగలిగే దానినే వ్యాయామం అంటారు. ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్ కోసం ప్రత్యేకమైన ఆహారం తీసుకోవాలి. కోడిగుడ్డులోని తెల్లటి సొన, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, మిల్క్‌బ్రెడ్, పచ్చరంగు పండ్లు, డ్రైఫ్రూట్స్ బాదం జిగురు (గోంద్ కటీరా) వంటి వాటిని ఆహారంగా తీసుకోవాలి.





సదస్సుకు హాజరైన యువకులు, మహిళలు, కోనసీమ స్టార్టప్ సమ్మిట్ బ్రోచరును ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శివశంకర్, అధికారులు

టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డుకు

దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2024 సంవత్సరానికి టెన్జింగ్ నారే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని కాకినాడ జిల్లా సెట్రాజ్ సీఈవో కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. 2022, 23, 24 సంవత్సరాల్లో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు https://awards.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాహస క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిని నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డుకు అర్హులన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం రూ.15లక్షల నగదు అందజేస్తారు.

పరిశ్రమల స్థాపనకు

యువత ముందుకు రావాలి



- ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి
- 'కోనసీమ స్టార్టప్ సమ్మిట్'లో కార్మిక శాఖ మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యువత పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం చోడవరం బైపాస్‌లోని విజయ ఫంక్షన్ హాలులో సోమవారం 'కోనసీమ స్టార్టప్ సమ్మిట్-2025 పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలనకు, ఉపాధి అవకాశాల పెంపునకు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. యువత ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరారు. ఎంఎస్ఎంఈల ద్వారా పరిశ్రమలు స్థాపించాలనే ఆలోచన ఉండి ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ఏడాదికి లక్ష 75వేల మంది పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎటువంటి హామీ లేకుండా రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు రుణం పొందే అవకాశాన్ని కోనసీమ జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ 2030 నాటికి ప్రతి ఇంటోనూ పారిశ్రామికవేత్త ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. యువత వినూత్నంగా ఆలోచించి జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు కృషి చేయాలన్నారు. కోనసీమ జిల్లాలో ఎక్కువ పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ నిర్మూలనకు మంత్రి సుభాష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ఫ్లిప్‌కార్ట్ డైరెక్టర్ డిప్పివంకాని మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కోనసీమ అనుకూలమైన ప్రాంతమన్నారు. ఇక్కడ తయారు చేసిన ఉత్పత్తులను ఫ్లిప్‌కార్ట్ ద్వారా అమ్మకాలు చేసుకునేందుకు కృషి చేస్తానన్నారు. కోనసీమ సమ్మిట్‌పై రూపొందించిన బ్రోచర్‌ను మంత్రి సుభాష్, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఆవిష్కరించారు. యువకులు, మహిళల సందేహాలను జిల్లా అధికారులు నివృత్తి చేశారు. సదస్సులో ఆర్డీవో అఖిల, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు ప్రసాద్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజరు మారుతి, సీడాప్ జేడీఎం కిరణ్, పశుసంవర్ధక శాఖ ఏడీ పెద్దిరాజు, లీడ్ బ్యాంకు మేనేజరు కేశవవర్మ, మత్స్య శాఖ ఏడీ కృష్ణ, జనసేన రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వాసంశెట్టి సత్యం, చిక్కాల దొరబాబు, పెసంగి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో

చెన్నై హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.మాల కుటుంబసభ్యులతో కలిసి సోమవారం విచ్చేశారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనం చేయించి పండితులతో వేదాశీర్వచనం ఇప్పించారు. న్యాయమూర్తి దంపతులకు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని ఈవో అందజేశారు.


న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

డీజిల్ మాఫియాపై కదలిక


నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో బంకు లీజుదారుడు వీరబాబు నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

- బయో డీజిల్ బంకులో అధికారుల దాడులు
- ప్రధాన పాత్రధారుడు వైసీపీ నాయకుడే ..
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో వెలుగులోకి ... పురుషోత్తపల్లి బంకులో తనిఖీలు

నిడదవోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న డీజిల్ మాఫియాపై 'ఆంధ్రజ్యోతి' లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. పొరుగు రాష్ట్రాల నుంచి దొడ్డిదారిన తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమ మార్గాల్లో బంకులకు చేర్చి, అక్కడ నుంచి ప్రముఖ కార్పొరేట్ కంపెనీ హెచ్‌పీ లోగోను అడ్డం పెట్టుకుని అనుమతుల్లేని వాహనాల్లో జిల్లాలోని ఇసుక ర్యాంపులు, లారీ స్టాండులో ఉన్న వాహనాలకు డీజిల్‌ను సరఫరా చేసేస్తున్నారు. ఈ మాఫియా వెనుక ముఖ్యపాత్ర, సూత్రదారి వైసీపీ నేత కావడం గమనార్హం. వివరాల్లోకి వెళితే నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఒక బయోడీజిల్ బంకును జగ్గంపేట సమీపంలోని ఒక గ్రామానికి చెందిన వైసీపీ నేత వీరబాబు లీజుకు తీసుకుని ఈ డీజిల్ మాఫియాకు తెరలేపాడు. బయో డీజిల్ పేరుతో ఉన్న బంకులో నుంచి పొరుగు రాష్ట్రాల నుంచి దొడ్డిదారిన డీజిల్, క్రూడ్ ఆయిల్ లాంటివి తెప్పించి ప్రముఖ ఆయిల్ కంపెనీ హెచ్‌పీ పేరుతో స్టిక్కరింగ్ చేయించి సుమారు 3000 లీటర్ల కెపాసిటీ కలిగిన ట్యాం కును బొలేరో వాహనానికి అమర్చి ట్యాంకుకు డిజిటల్ ఎక్విప్‌మెంట్‌తో పాటుగా డీజిల్ కొట్టేందుకు గన్‌ను ఏర్పాటు చేసి ఈ మాఫియా సాగిస్తున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' బట్టబ యలు చేసింది. దీనిపై అధికారులు స్పందించి సోమవారం బంకుపై దాడులు నిర్వహించారు. డివిజినల్ ఏఎస్‌వో నాగాంజనేయులు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బంకు లీజుదారుడు వీరబాబు ఆధ్వర్యలోనే తాళాలు వేసి వున్న బంకును తెరిపించి రికార్డులను పరిశీలించడంతో పాటు ఆయిల్ శాంపిల్స్‌ను సేకరించారు. దీనిపై పూర్తి నివేదికను జేసీ చినరాముడుకు అందిస్తామని తెలిపారు. ఈ దాడుల్లో రాజానగరం రంగంపేట సివిల్ సప్లయిస్ తహశీల్దార్ బాపిరాజు, పెరవలి సివిల్ సప్లయిస్ తహశీల్దార్ సుధీర్ రెడ్డి, నిడదవోలు సివిల్ సప్లయిస్ తహశీల్దార్ అనిల్ కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యేంద్ర, వీఆర్ వోలు సునీల్, రాంబాబు పాల్గొన్నారు.

- కొవ్వూరు డివిజన్ ఏఎస్‌వో నాగాంజనేయులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ బయో డీజిల్ బంకులో భూమిపైన ఉన్న ఒక ట్యాం కులో నుంచి భూమిలోపల ఉన్న మరో ట్యాంకు నుంచి ఆయిల్ శాంపిల్స్ సేకరించామని, వీటిని విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి డీజిలో, బయోడీజిలో నిర్ధారణ చేసుకుని తదు పరి చర్యలు తీసుకుంటా మని తెలిపారు. అలాగే హెచ్‌పీ కంపెనీ పేరుతో అనుమతులు లేకుండా బంకు లీజుదారుడు వీరబాబు తిప్పు తున్న వాహనాన్ని గుర్తించేందుకు కూడా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

131 కేజీల గంజాయి పట్టివేత

- నలుగురి వ్యక్తులు, మూడు కార్లు, రూ. 16,500 నగదు స్వాధీనం
- వెల్లడించిన పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు


గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ హరిబాబు

అన్నవరం, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి అటవీప్రాంతం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 131 కేజీల గంజాయిని సోమవారం అన్నవరం పోలీసులు నెల్లిపూడి శివారు శంఖవరం కత్తిపూడి రోడ్డులో పట్టుకున్నారు. అలాగే నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే .. ఏఎస్ఆర్ జిల్లా మాడుగుల మం డలానికి చెందిన పొంగి కృష్ణారావు, జగ్గందొర గోపాల్, గొల్లూరి మత్యరాజు రెండు కార్లలో గంజాయిని తెస్తూ నెల్లిపూడి సమీపంలో రాజమహేంద్రవరానికి చెందిన కొమలి రామకృష్ణకు చెందిన కారులోకి మార్చుతుండగా పట్టుకున్నారు. గంజాయిని పొంగి కృష్ణారావు వద్ద నుంచి కోమలి రామకృష్ణ తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు హైదరాబాద్, మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. నలుగురితో పాటు మూడు కార్లు, నాలుగు చరవాణీలు, రూ. 16,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనివిలువ రూ. 6.65 లక్షలు ఉంటుందని డీఎస్పీ వెల్లడించారు. అన్నవరం ఎస్ఐ హరిబాబు, అదనపు ఎస్ఐ ఎల్. ప్రసాద్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఏపీఈఏపీ సెట్‌లో 'ఆదిత్య' విద్యార్థుల జయకేతనం


పాలకుర్తి ఆదిత్య అభిషేక్ (13 ర్యాంక్)


గొల్లపల్లి లోషిణి 72వ ర్యాంక్


వై.శుభశ్రీవల్లీ 91వ ర్యాంక్


వి.సాయి భవ్య హర్షిణి, 31వ ర్యాంక్


డి.దేవి సౌమ్యశ్రీ 112వ ర్యాంక్


పి.సాయిశ్రీధర్ 119వ ర్యాంకు

కాకినాడరూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ విడుదల చేసిన ఏపీఈ ఏపీ సెట్ ఫలితాల్లో కాకినాడ 'ఆదిత్య' విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారు. ఇంజనీరింగ్ విభాగంలో పి.ఆదిత్య అభిషేక్ (13), జి.లోషిణి (72), వై.శుభశ్రీవల్లీఆత్రేయి (91), జి.శ్రీరామ శశాంక్ (95), వై.వేజిత్ (96) ర్యాంకులు సాధించారు. తమ విద్యార్థులు 121, 136, 156, 169, 170, 172, 177, 198 ర్యాంకులను కూడా కైవసం చేసుకున్నారని ఆ విద్యాసంస్థల కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్ రెడ్డి సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అగ్రికల్చర్ ఫార్మసీ విభా గంలో వి.సాయిభవ్య హర్షిణి (31), డి.దేవి సౌమ్యశ్రీ (112), పి.సాయిశ్రీధర్ (119), సీహెచ్ శ్రీవెంకటశివసాయి అచ్యుత (152) ర్యాంకు లు సాధించారు. 100 లోపు ఆరుగురు, 500లోపు 38 మంది, 1000 లోపు 62 మంది ర్యాంకులు సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, ప్రిన్సిపాల్ మొయినా అభినందించారు.

ముగిసిన అప్పనపల్లి బాలబాలాజీ తిరుకల్యాణోత్సవాలు


శ్రీపుష్పయాగంలో భాగంగా దీపాలు వెలిగించిన భక్తులు

మామిడికుదురు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి తిరు కల్యాణోత్సవాలు సోమవారం నిర్వహించిన శ్రీపుష్పయాగంతో ముగిశాయి. ఐదురోజుల పాటు ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాస్, చినజీయర్‌స్వామి శిష్యబృందం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శ్రీపుష్పయాగంలో భాగంగా అర్చకులు ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

నేడు మావోయిస్టుల దేశ వ్యాప్త బంద్

- పలు వాహనాల దారి మళ్లింపు
- పోలీస్ గస్తీ ముమ్మరం


నెల్లిపాక జంక్షన్‌లో వాహనాల దారి మళ్లింపు చేపడుతున్న సీఐ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

ఎటపాక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త బంద్‌కు మంగళవారం మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏజెన్సీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా వాహనాల దారి మళ్లింపు చర్యలను సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభించారు. భద్రాచలం నుంచి వయా లక్ష్మీపురం మీదుగా చిం తూరు, ఆపై ప్రాంతాలకు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. భద్రాచలం - కూనవరం రోడ్డులో నెల్లి పాక నుంచి జగ్గవరం జంక్షన్ మీదుగా చట్టి వరకు వాహనాలు వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఈ దారిలోనే వాహనాలు రాకపోకలు సాగించాలని సీఐ కన్నప రాజు సూచించారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత భద్రాచలం నుంచి ఘాట్ రోడ్, సీలేరు, కుంట వైపుకు వేళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను భద్రతా కారణాల రీత్యా రద్దు చేసినట్టు తెలిపారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ అండ్ యాంకిల్ జోనల్ సీఎంఈ


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆర్థో వైద్య నిపుణులు

జీజీహెచ్(కాకినాడ) జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలో ఫుట్ అండ్ యాంకిల్ సమస్యలపై ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అధ్యక్షతన సోమవారం జోనల్ సీఎంఈ జరిగింది. రాజమహేంద్రవరం జీఎస్ఎల్, అమలాపురం కిమ్స్ మెడికల్ కళాశాలల ఎముకల విభాగ పీజీలు, జూనియర్ డాక్టర్లు మొత్తంగా 130 మందికి సీఎంఈ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సీఎంఈ ద్వారా ఆధునిక వైద్య పద్ధతులు, సాంకేతిక అంశాలపై వైద్య నిపుణులు వైద్య విద్యార్థులకు విశదీకరించారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పివి ప్రసన్నకుమార్, జోనల్ సీఎంఈ కోఆర్డినేటర్ డాక్టర్ రమణకుమార్, డాక్టర్లు యెన్నపు నాగేశ్వరరావు, ముఖర్జీ, బీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, పురుషోత్తం, దక్షిణామూర్తి, శ్రీమన్నారాయణ, డాక్టర్ సాయికృష్ణ, అరుణకుమార్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

కరప, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరపకు చెందిన బి.గోవిందు-లీల దంపతులు స్థానికంగా జిలేబీ షాపు నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. వారి కుమార్తె పాయల్ స్థానిక హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం పదో తరగతి విద్యార్థి ఉష పుట్టినరోజు అని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన పాయల్ ఎంతకీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఆమె స్నేహితులు, బంధువులు ఇళ్ల వద్ద, చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం సాయంత్రం బాలిక తల్లి కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆటోను బైక్ ఢీకొని ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు

వేర్వేరు ప్రమాదాల్లో మరో నలుగురు మృతి

తుని రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆటోను ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరుగా యాలపాలైన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం కొలిమేరు గ్రామ సమీపంలో జరిగింది. ఎన్ఎస్‌వీ నగరం నుంచి తునికి ద్విచక్రవాహనంపై బయల్దేరిన లోకా రాజబాబు(38), కొల్లు అప్పలకొండ, సప్పి దేవుడు కొలిమేరు వద్ద గూడ్స్ ఆటోను ఢీకొన్నాడు. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా లోకా రాజబాబు చికిత్స పొం దుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్..

బిక్కవోలు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాకలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్‌కు ట్రక్కుకు మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతిచెందాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం..బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన వేమగిరి రాజేష్(30) పందలపాకలోని మట్టిని బట్టీలకు ట్రాక్టర్‌పై తోలుతున్నాడు. సోమవారం ట్రాక్టర్‌పై మట్టిని తరలిస్తుండగా ఇంజన్ మట్టిలో కూరుకుపోవడంతో ట్రక్కు శీల పిన్ విరిగిపోయింది. దీంతో ఇంజన్‌పై ట్రక్కు ప డడంతో రాజేష్ రెండింటికి మధ్యలో ఇ రుక్కుపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


ట్రాక్టర్ ఇంజన్‌కు ట్రక్కు మధ్యలో ఇరుక్కుపోయి మృతిచెందిన రాజేష్

కంటైనర్‌కు విద్యుత్ వైర్ తగిలి..

కొత్తపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం ఖండ్రిక వద్ద కంటైనర్ లారీకి 6.2కేవీ లైన్ విద్యుత్ వైర్ తగిలి లారీ డ్రైవర్ మృతి చెందినట్టు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. బీహర్‌కు చెందిన కంటైనర్ లారీ బీఆర్ అంబేడ్కర్ జిల్లా అమలాపురం నుంచి రావులపాలెం వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో ఖండ్రిక వద్ద లారీని పక్కకు తీసి ఆపగా విద్యుత్‌లైన్ లారీకి తగిలి షాక్‌కు గురై డ్రైవర్ మృతిచెందాడు. మృతుడు బీహర్‌కు చెందిన కమల కి షో ర్ షాగా గుర్తించారు. మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పలివెల వీఆర్వో నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.






కంటైనర్‌ను తగిలిన విద్యుత్ వైర్, మృతుడు కమల కిషోర్‌షా

గోదావరిలో జారిపడి ఓ వ్యక్తి..

మామిడికుదురు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక గ్రామానికి చెందిన మోటిపల్లి స్వామినాయుడు (36) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మరణించాడు. హైదరాబాద్‌లో టైలరింగ్ వృత్తి జీవనం సాగిస్తున్న స్వామినాయుడు శనివారం స్వగ్రామం వచ్చాడని బంధువులు తెలిపారు. కుమార్తెను, కుమారుడిని హైదరాబాద్ తీసుకువెళ్లేందుకు వచ్చి సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి కనిపించకుండా పోవడంతో గాలింపు చేపట్టగా గోదావరిలో మృతదేహం లభ్యమైంది. దీనిపై నగరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఒకరు..

తుని రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తుని రైల్వేస్టేషన్ పరిధిలో జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ జి. శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. మృతుడి ఒంటిపై ఎరుపు, తెలుపు రంగు చొక్కా, నీలం రంగు నిక్కర్ ఉన్నాయని, మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే ఎస్ఐని సంప్రదించాలని కోరారు.

టిప్పర్‌ను ఢీకొన్న ఆటో

కోరుకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న టిప్పర్‌ను ఆటో ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ వైపుగా వెళుతున్న టిప్పర్‌ను బూరుగుపూడిలో డ్రైవర్ పక్కకు ఆపాడు. దీంతో వెనుక నుంచి వస్తున్న ఆటో వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో వృద్ధురాలి పరిస్థితి విషయంగా ఉంది. క్షతగాత్రులను రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్

ఆరుగురికి స్వల్ప గాయాలు

గుంటూరు నుంచి పొల్లూరు జలపాతానికి వస్తుండగా ఘటన


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మోతుగూడెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విహారయాత్రకు పొల్లూరు జలపాతానికి వస్తుండగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదం జరిగింది. అందరూస్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు నుంచి ఆరుగురు స్నేహితులు ఓ వ్యాన్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతానికి బయల్దేరారు. మోతుగూడెం పరిధిలో సుకుమామిడి-తూలుకొండ రోడ్డులో వ్యాన్ సోమవారం ఉదయం 6గంటలకు అదుపు తప్పి టేకు చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికీ చిన్న చిన్న గాయాలయ్యాయి. వారు అటుగా వస్తున్న ఆటో ఎక్కి మోతుగూడెం ఏపీ జెన్కో భవ్య హెల్త్ సెంటర్‌లో ప్రథమ చికిత్స చేయించుకున్నారు. ఎస్ఐ సాదిక్‌కు సమాచారం తెలియడంతో వారిని మెరుగైన వైద్యం కోసం చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


చెట్టును ఢీకొన్న వ్యాన్

రాజకీయాలకు జగన్ అనర్హుడు

ఎక్స్ వేదికగా యనమల రామకృష్ణుడు విమర్శలు



తుని రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రాజకీయాలకు అనర్హుడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఎక్స్ వేదికగా విమర్శలు సంధించారు. అమరావతి ప్రాంత మహిళలను అసభ్యకర పదజాలతో సాక్షి మీడియా డిబేట్‌లో వైసీపీ నాయకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై యనమల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై యావత్తు మహిళ సంఘాలు ఆందోళన చేస్తున్న జగన్మోహన్ రెడ్డి పెదవి విప్పకపోవడంతో దీని వెనుక జగన్ పాత్ర ఉందే మోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని యనమల ఎక్స్ అకౌంట్‌లో ట్వీట్ చేశారు.మహిళలపై దుర్భాషలాడిన వైసీపీ నాయకులపై కానీ, సాక్షి మీడియాపై కానీ జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని ప్రశ్నించిన యనమల కనీసం వ్యవహారాన్ని జగన్ రెడ్డి ఖండించకపోవడం క్షమాపణలు చెప్పకపోవడం శోచనీయమన్నారు. ఇలాంటి వ్యక్తి రాజకీయాలకు ఏ మాత్రం అర్హుడు కాదని యనమల పేర్కొన్నారు. ఈ వ్యవహారంతో వైసీపీ నీచ సంస్కృతి బయట పడిందని అన్నారు.

రోజ్‌వుడ్ మంచాలు స్వాధీనం

మారేడుమిల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న రెండు రోజ్‌ఉడ్ మంచాలను అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సీలేరు నుంచి మోతుగూడెం మీదుగా రాజమండ్రి వెళుతున్న ఆర్టీసీ బస్సులో రెండు విలువైన రోజ్‌వుడ్ మంచాలనుతరలిస్తున్నారని అటవీ శాఖాధికారులు అందుకున్న స మాచారంతో మారేడుమిల్లి అటవీశాఖ కార్యాలయం వద్ద బస్సును ఆపి తనిఖీలు నిర్వహించి మంచాలను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ రవాణాపై పూర్తి సమాచారం కోసం విచారణ చేస్తున్నామని దీనిపై అటవీ సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐ చొరవతో ఆశ్రమానికి వృద్ధుడి అప్పగింత


వృద్ధుడిని ఆశ్రమానికి అప్పగించిన దృశ్యం

సామర్లకోట, మే 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో సుమారు 79 సంవత్సరాల వయసున్న అనాథ వృద్ధుడిని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు గుర్తించి కాకినాడలోని వృద్ధాశ్రమానికి సోమవారం అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు పరిధిలోని ఏలేరు ప్రాంతానికి చెందిన వాకపల్లి చిన్నరాజు కొన్ని రోజులుగా సామర్లకోట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు గుర్తించి చేరదీసి అతడి నుంచి సమాచారం రాబట్టారు. ముందూ వెనుకా ఎవరూ లేరని నిర్ధారించి కాకినాడలోని జనావళి వలంటరీ ఆర్గనైజేషన్ అనే ఓల్డ్ ఏజ్ హోమ్‌నకు సంరక్షణార్థం అప్పగించారు.అతని సంరక్షణకు అయ్యే ఖర్చును గరగారావు భరించేందుకు అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మానవత దృక్పథాన్ని, దాతృత్వాన్ని పలువురు అభినందించారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు

ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు.. సొసైటీ ప్రతినిధులకు శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న నరసింహారావు

దివాన్‌చెరువు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నేలలు, వాటిని సారవంతం చేసే విభిన్న పద్ధతుల శాస్త్రీయ అధ్యయనంతో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో పనిచేసే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సు శిక్షణా కార్యక్రమం దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ 15 రోజుల శిక్షణలో వివిధ శాస్త్రవేత్తలతో నేలలు, నేల ఫలదత, ఎరువుల వాడకం, సమస్యాత్మక భూముల సవరణ, జీవ ఎరువులు వంటి పలు అంశాలపై శిక్షణ కల్పించబడుతుందన్నారు. తొలిరోజు శిక్షణలో ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ నేలలు, రకాలు, వివిధ పంటలకు అవసరమయ్యే పోషకాలపై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, జిల్లా సహకార సంఘం అధికారి జగన్నాథరెడ్డి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధికారి భారతి, జిల్లా వనరుల ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, వివిధ పరపతి సంఘ ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

42వ డివిజన్ రోడ్డు పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసి సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలో 42వ డివిజన్‌లో ఎల్‌బీ శాస్త్రి రోడ్డులో రూ.35 లక్షలు వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఎటు చూసిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో సుమారు రూ.250 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రోడ్లు, కాలువలు, నిర్మిస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జేఎన్ రోడ్డు వంటి ప్రాంతాల్లో అవసరం లేకపోయినా డివైడర్లు, ఫుట్‌పాత్‌లు నిర్మించారని, మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఎమ్మెల్యే వాసు విమర్శించారు. రాజమండ్రి చరిత్రలో నిలిచిపోయేలా కూటమి అభివృద్ధి పనులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మళ్ల వెంకట్రాజు, కేవీ శ్రీనివాస్, సావిత్రి, వానపల్లి శ్రీనివాస్, కొండబాబ, మహబూబ్‌ఖాన్, సలాది ఆనంద్, జవ్వాది మురళీకృష్ణ, పాలవలస భద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయంతోనే నూతన ఇసుక ర్యాంపులు

రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్
సీతానగరంలో నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ సభ

సీతానగరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయంతోనే ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ తెలిపారు.సోమవారం సీతానగరం పంచాయతీలో నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరం రెవెన్యూ లంక భూముల్లో 4.81 హెక్టార్ల భూమిలో ఇసుక తవ్వకాలు జరుగుతాయని, గోదావరి పరివాహక ప్రాంతంలో తవ్విన ఇసుకను సీతానగరం ర్యాంపు నుంచి రవాణా చేయనున్నట్లు చెప్పారు. అనుమతులు కోరుతున్నారని, దీనిపై ప్రజల అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆర్డీవో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ ఇసుక వాహనాలు అత్యంత వేగంగా నడుపుతున్నారని, రోడ్లపై ఇసుక పడడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నదీ గర్భంలో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువగా లోతు తవ్వుతున్నారని వీటన్నింటిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి శంకర్, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కళా గౌతమి కవి సమ్మేళనం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యో తి): స్థానిక మెయిన్ రోడ్డులో టౌన్ హాల్లో కళా గౌతమి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో రక్త సింధూర భారతి అంశంపై సోమవారం కవి సమ్మేళనం జరిగింది. ముందుగా ఇటీవల ఉగ్రవాదుల పోరాటంలో అసువులు బాసిన నాయక్ తదితర అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించి, భరతమాత ముద్దు బిడ్డల సింధూరం రాల్చిన రాక్షసుల దాడిని ఖండించారు. ఈ అంశాలపై ముఖ్య అతిథి, కవి, రచయిత వీవీ సుబ్రహ్మణ్యం తన ఉపన్యాసంతో అవగాహన కల్పించారు కార్యక్రమంలో కవులు ఎ.కోదండరామ్, బీహెచ్ రమాదేవి, ముగడ సూర్యనారాయణ, వీవీబీ సంజీవరావు, కేవీ రామారావు, కె.ప్రసాద్, ప్రదీప్, భద్రరావు, ఓబులేసు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- వర్చువల్‌గా స్వర్ణాంధ్ర విజన్ -2047 కార్యాలయం ప్రారంభం
- వీక్షించిన నాయకులు, అధికారులు

అనపర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు విజన్-2047 కార్యక్రమాన్ని రూపొందించారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తిలోని ఎంపీడీవో కార్యాలయంలో ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించిన స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యాలయాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ముందుగా సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే నల్లమిల్లి అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, కూటమి నాయకులు నియోజకవర్గ పరిధిలో అవసరాలను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్రప్రదేశ్ సీపీఏపీ యూనిట్‌ను నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు ప్రత్యేకంగా నియమించిన సీపీఏపీ టీముల సభ్యులు, మూడు మండలాలకు చెందిన ఎంపీడీవోలు, తహశీల్దార్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరిలో గౌతమి ఘాట్ వద్ద సుమారు 65 ఏళ్ల వయస్సు గల వృద్ధుడు మృతిచెంది వున్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం తెలుపు రంగు పంచె, తెలుపు రంగు చొక్కా ధరించి ఉన్న ఓ వృద్ధుడు గోదావరిలో శవమై కనిపించడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు టూటౌన్ పోలీసులు సెల్ నెంబర్లు 94407 96576, 96521 55779కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

రంగంపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా సోమవారం రంగంపేట శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం(హిందూ సామ్రాజ్య దినోత్సవం) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దాపురం ఖండ ధర్మ ప్రచారక్ సమరసత సేవా ఫౌండేషన్ తంగెళ్ల రాంబాబు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో శింగన సత్యనారాయణ, ఉండవిల్లి మాణిక్యం, గుత్తుల సుబ్రహ్మణ్యం, పోతుల వీరసుందరావు, బొడ్డు జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కు 16 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 16 అర్జీలు వచ్చాయి.. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అర్జీలను స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖలకు బదలాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలకు నాణ్యమైన పరిష్కారాలు చూపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొంతెండుతోంది..


వెలుగుబందలో లేఅవుట్

- వెలుగుబంద లేఅవుట్‌లో దాహార్తి
- 13 వేలు మంది లబ్ధిదారులు
- 2 ట్యాంకుల ద్వారా నీటి సరఫరా
- జగనన్న కాలనీవాసులను వెంటాడుతున్న తాగునీటి కష్టాలు

రాజానగరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన మండలంలోని వెలుగుబంద పంచాయతీ పరిధిలో నూతనంగా నెలకొల్పిన జగనన్న కాలనీవాసులను తాగు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. కాలనీలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో అక్కడక్కడా అరకొరగా చేపట్టిన ఇళ్లలో నివాసించేందుకు లబ్ధిదారులు నిరాకరిస్తున్నారు. వెలుగుబంద లేఅవుట్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 13 వేలు మంది లబ్ధిదారులకు సంబంధించి 9 బోర్లు ఏర్పాటు చేసి, 5 మంచినీటి ట్యాంకులను నిర్మించారు. వీటిలో ప్రస్తుతం రెండు ట్యాంకుల నుంచి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కొంతమంది లబ్ధిదారులు ట్యాంకుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. వెలుగుబంద లేఅవుట్లో వేలాది మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ప్లాట్లు కేటాయించినప్పటికి కేవలం 100-150 మంది మాత్రమే అక్కడక్కడ ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుని ఇంటికి కుళాయి ఏర్పాటు చేసింది. మంచి నీటి ట్యాంకర్లపై ఉండే క్లీనర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. ఉచితంగా అందించాల్సిన నీటిని టిన్నుల పరిమాణాన్ని బట్టి రూ.50, రూ.100, రూ.300 వరకు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత వేసవిలో మంచి నీటి ఎద్దడి తలెత్తి ఇబ్బందులు పడుతున్నామని, పట్టించుకునే నాథుడు లేకపోయారని కాలనీవాసులు వాపోతున్నారు. పిల్లా పాపలతో ఊరుకాని ఊరొచ్చి కనీస సదుపాయాలు లేక పడరాని పాట్లు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఏ సమస్య వచ్చినా సుదూర ప్రాంతం వెళ్లాల్సి వస్తోందన్నారు. కాలనీలో సరఫరా చేసే నీరు కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో వృథాగా పోతున్నాయని అంటున్నారు.


లేఅవుట్‌లో నిర్మించిన ఓ వాటర్ ట్యాంకు






నీరు లేకపోవడంతో ట్యాంకర్లతో తెచ్చుకుని పనులు చేసుకుంటున్న దృశ్యం

ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నాం..

వెలుగుబంద లేఅవుట్‌లో 9 బోర్లు ఏర్పాటు చేశాం. 5 ట్యాంకులను నిర్మించాం. వీటిలో ప్రస్తుతం 2 ట్యాంకుల నుంచి నీరు సరఫరా అవుతోంది. అక్కడక్కడ ఇల్లు నిర్మించుకున్న వారికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేయాలనే ఉద్దేశంతో ప్రతి ప్లాటుకు కుళాయిలు ఏర్పాటు చేశారు. అయితే పూర్తి స్థాయిలో నివాసాలు ఏర్పాటు చేసుకోకపోవడంతో కొంతమంది ఆకతాయిలు ట్యాప్‌లను తొలగించడంతో తాగునీరు వృథాగా పోతోంది. నగరపాలక సంస్థ ట్యాంకర్లను ఇచ్చింది. లేఅవుట్లో ఉన్న బోర్లు ద్వారా నీటిని ట్యాంకర్లలో నింపి సరఫరా చేస్తున్నాం. మరో నెల రోజుల్లో లేఅవుట్లో నిర్మించిన 5 ట్యాంకుల్లో నీటిని నింపి పూర్తి స్థాయిలో సరఫరా చేస్తాం..

-ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్.

యోగాంధ్ర సాధనకు కృషి చేయాలి

బిక్కవోలు ఎంపీడీవో శ్రీనివాస్
పలుచోట్ల అవగాహన ర్యాలీలు



బిక్కవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బిక్కవోలు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ యోగాంధ్ర సాధనకు కృషి చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాస్ కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ప్రతి గ్రామంలోను ర్యాలీలు జరిపారు. ఈ సందర్భంగా బిక్కవోలులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ యోగా సాధనతో మానసిక ఒత్తిడి తగ్గి రోగాలు నయమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ అరగంట సేపు యోగా చేయాలన్నారు. తహశీల్దార్ కృష్ణచైతన్య, పీహెచ్‌సీ వైద్యులు దుర్గాదేవి, ఎంతఈవేలు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో నిర్వహించిన ర్యాలీల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో భారతి, డిప్యూటీ తహశీల్దార్ సునీత తదితర అధికారులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పాత పోలీస్‌స్టేషన్ మీదుగా నాలుగు బొమ్మల సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బ స్టాండ్ సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి యోగాంధ్ర.. ఆరోగ్యాంధ్ర అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి జీవితలో భాగం కావాలని, ఆత్మను, శరీరాన్ని ఏకం చేసే శక్తి యోగాకే ఉందన్నారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాంధ్ర అవగాహన ర్యాలీని ఎంపీడీవో సాయిబాబు ప్రారంభించి మాట్లాడారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. స్థానిక ఏడీబీ రోడ్డు వరకు జరిగిన ఈ ర్యాలీలో ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, ఉండవిల్లి గిరిబాబు, పోతుల చిన్నికాపు, ఎంతఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి, గ్రామ సెక్రటరీ శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని వడిశలేరు, చంద్రేడు గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీలు నిర్వహించారు.


సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే నల్లమిల్లి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నల్లమిల్లి మూలారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టోర్నమెంట్లు క్రీడాకారుల్లో పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు జరిగిన పోటీల్లో బిక్కవోలు అంబేడ్కర్ జట్టుపై అనపర్తి 11వీఎస్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, బెండమూరి రాజు, మామిడిశెట్టి శ్రీను, చౌదరి, కర్రి శేషారత్నం, సుభాషిణి పాల్గొన్నారు.

క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలి

కడియం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల వైపు ఆసక్తి పెంచుకోవాలని మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి తెలిపారు. గ్రామ పరిధిలోని చైతన్యనగర్‌లో సీపీఎల్ సీజన్ చైతన్యనగర్ ప్రీమియర్ లీగ్ పేరిట జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ఫైనల్‌లో వీరవరం జట్టుపై కడియపులంక జట్టు గెలుపొందింది. విన్నర్ జట్టుకు రూ.19,999, రన్నర్ జట్టుకు రూ.9,999 నగదుతో పాటు ట్రోఫీలను చంటి అందజేశారు. గత నెల 7న ప్రారంభమైన ఈ పోటీల్లో పలు మండలాల నుంచి 35 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉగ్గిన నాగరాజు, గుత్తుల సాయి, ఎన్‌కే మీరా, ఆరుమిల్లి రాజు, మద్ది సత్తిబాబు, బెల్లం రమేష్, పూనిపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

జూలై 4న పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభ

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభను వచ్చేనెల 4న కొంతమూరు సమీపంలో ప్రకృతి వనం వద్ద నిర్వహిస్తున్నామని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. స్థానిక రాజీవ్‌గాంధీ కళాశాలలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభ విషయంలో హైకోర్టులో తాము వేసిన పిటిషన్‌పై న్యాయస్థానం స్పందించిందని ఎలాగైనా సభ జరుగకుండా చేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేసిందన్నారు. అయితే మళ్లీ సభ అనుమతికి దరఖాస్తు చేసుకోవాలని తమను, అలాగే అనుమతి మంజూరు చేయాలని కోర్టు సూచించిందన్నారు. తాను ఇప్పుడు అనుమతి కోసం లెటర్ పెడుతున్నానన్నారు. జూలై 4న సాయంత్రం జరిగే సభకు క్రైస్తవులు, సెక్యూలర్ వాదులు, ప్రవీణ్ సంఘటన హత్య అని నమ్మేవారంతా రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే చాలా మంది పాస్టర్లు, క్రైస్తవులపై బైండోవర్ కేసులు పెట్టారని వాటిని జిల్లా పోలీసులు ఎత్తివేయాలని, లేకపోతే దానిపై కూడా హైకోర్టులో పిటీషన్ వేస్తానని హర్షకుమార్ చెప్పారు. కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయకుండా రూ.82 వేల కోట్లతో బనక చర్లను నిర్మిస్తామనడం అవివేకమన్నారు. అమరావతి రాజధాని మహిళలపై తప్పుగా మాట్లాడిన వారిని చెప్పుతో కొట్టాలన్నారు. అయితే అమరావతికి చుట్టుపక్కల భూములు ఇచ్చిన మహిళలు వారి భూములు రాజధాని పరిధిలోకి రావు అనే విషయం గ్రహించాలని హర్షకుమార్ అన్నారు.

ప్రతి జిల్లా కేంద్రంలో కాపు భవనం ఏర్పాటు చేయాలి

- సీఎం చంద్రబాబుకు విన్నవించాం
- కాపు మహానాడు ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు రఘు నరేష్


సమావేశంలో మాట్లాడుతున్న రఘు నరేష్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాపు సామాజిక భవనాలు ఏర్పాటు చేసేందుకు స్థలం కేయించాలని సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందచేసినట్టు కాపునాడు ఉభయ గోదావరి జిల్లా అధ్యక్షుడు గుదె రఘునరేష్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమండ్రిలో కాపు సామాజిక భవనం ఏర్పాటు చేయాలని తమ సంఘం తరుపున మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరిలకు విజ్ఞప్తి చేశామని, భవనానికి 30 సెంట్ల స్థలం కేటాయింపులో దుర్గేష్, పురందేశ్వరి కీలక పాత్ర పోషించారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా బొమ్మూరులో కాపు భవన నిర్మాణం పూర్తి చేయించాలని నరేష్ కోరారు. తమ కాపునాడు సంఘం దేశంలోని 15 రాష్ట్రాల్లో విస్తరించి ఉందని చెప్పారు. ఈ సమావేశంలో కాపునాడు పార్లమెంట్ అధ్యక్షుడు దేశినీడి రాంబాబు, రాజానగరం అధ్యక్షుడు కాళ్ల చక్రరావు, జి.విజయలక్ష్మి, మేడిశెట్టి పద్మ, పుర్లింకల సతీష్, పసలపూడి నారాయణ, సలాది నాయుడు, మర్రి దుర్గాప్రసాద్, కుంపట్ల రామకృష్ణ, సిమాద్రి నాగభూషణం, ర్యాలి రామకృష్ణ, కోరుమిల్లి నాయుడు పాల్గొన్నారు.

మట్టి రవాణాతో వివాదం

కోరుకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం నర్సాపురంలో రామస్వామి చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న నేపథ్యంలో భారీ వాహనాలు కారణంగా గ్రామంలో వివాదం జరిగింది. దీంతో చెరువు నుంచి మట్టిని రవాణా చేస్తున్న వాహనాలను స్థానిక యువకులు అడ్డగించారు. రోడ్డుపై జనం గుమ్మిగూడి ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో అటుగా వెళుతున్న కారు యజమాని కారు ఆపి వివరాలు అడగడంతో సమస్య తలెత్తింది. కారు యజమానితో స్థానికులకు వాగ్వాదం జరిగింది. కారు అద్దాలు పగులగొట్టారు. దీంతో అక్కడకు పోలీసులు చేరుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదని ఇరువర్గాలను హెచ్చరించి పంపినట్టు ఎస్ఐ కూన రవికుమార్ తెలిపారు.

నన్నయ వసతి గృహ మరమ్మతుల పరిశీలన

దివాన్‌చెరువు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరుగుతున్న వసతి గృహ మరమ్మతులను వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఇంజనీర్లు, హాస్టల్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి వసతి గృహంలో ఉండే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చేయాలనే ఉద్దేశంతో సెలవుల్లో వసతి గృహాలపై దృష్టి సారించామని వీసీ అన్నారు. మెన్ అండ్ ఉమెన్ హాస్టల్స్‌లో మరమ్మతులు చేపట్టామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడియం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ఎస్ పనులు నిమిత్తం వేమగిరి సబ్‌స్టేషన్ పరిధిలో జేగురుపాడు ఫీడర్‌కు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ (ఆపరేషన్), జేపీబీ నటరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. దీని వల్ల ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జేగురుపాడు గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

సీతానగరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో సోమవారం వైద్యులు డాక్టర్ ఏవీకె చైతన్య, డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 42 మంది గర్భిణులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు.

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 41.0 (సోమవారం)

కనిష్ఠం : 28.0





షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు చిత్రంలో మంత్రి దుర్గేష్, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల, బత్తుల, వాసు, ఎమ్మెల్సీ సోము

షైనింగ్ స్టార్స్ స్ఫూర్తిగా నిలవాలి

విద్యార్థుల సత్కార సభలో మంత్రి నిమ్మల

- పది,ఇంటర్ విద్యార్థులకు సత్కారం
- జిల్లాలో 169 మంది స్టార్స్
- నగదు,ప్రశంసాపత్రం అందజేత
- ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యం
- స్మార్ట్ వర్క్ అవసరం : మంత్రి దుర్గేష్



కార్యక్రమానికి హాజరైన చిన్నారులు.. ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు గోరంట్ల, బత్తుల, వాసు

రాజమహేంద్రవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంట ర్మీడియట్ పరీక్షల్లో జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన 169 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్-2025 పేరుతో రాజమహేంద్రవరం నారాయణదాస సవా సమితిలో నిర్వహించిన సత్కార కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యకు అత్యధికంగా నిధులు మంజూరు చేస్తూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోందన్నారు. విద్య శ్రమ,క్రమశిక్షణతోనే అలవడుతుందని చెప్పారు. షైనింగ్ స్టార్ సత్కారం తొలి మెట్టుగా భావించి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 5088 మంది విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్నామన్నారు. మానవ వనరుల అభివృద్ధి మంత్రి లోకేశ్ రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ప్రతి విషయంలోనూ దూరదృష్టితో వ్యవహరిస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం, మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ హార్డ్ వర్క్‌కి బదులుగా స్మార్ట్ వర్క్ అవసరమని అన్నారు.షైనింగ్ స్టార్స్ తమకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ప్రజా సేవలో తమకు కూడా ప్రతిభా పురస్కారాలు దక్కాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో రూ.2 బిలియన్ల ఎకానమీ సాధించడానికి, 5 వేల ఉద్యోగాలు కల్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. పది ఫలితాల్లో గత ఏడాది 23వ స్థానంలో ఉన్న జిల్లాను ఈసారి 6వ స్థానానికి తీసుకెళ్లడం హర్షనీయమన్నారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ షైనింగ్ స్టార్ సత్కారం తొలి మెట్టుగా భావించి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యా జీవితంలో విజయ పరంపర కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అవకాశాలు అందిపుచ్చుకొని ఎదుగుదలకు బాటలు వేసుకోవాలన్నారు. విద్యలో స్పర్థ, వ్యాపారంలో వైరం ఉండాలని అంటారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. విద్యా ద్వారానే సమానత్వం సిద్ధిస్తుందన్నారు. ఓ బాలిక ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూపులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలోనే నిలిచి తన వద్దకు రాగా.. ఆమె ప్రైవేటు కళాశాల విద్యార్థి అనుకున్నానని.. కానీ నిడదవోలు ప్రభుత్వ కళాశాల విద్యార్థి అని చెప్పారు.ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది ఒక రుజువని పేర్కొన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిన రంగాల్లో విద్యా రంగం కూడా ఒకటన్నారు. చివ రికి బెల్టులపై కూడా జగన్ పేరు రాసుకునే వారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ వంటి మహనీయుల పేర్లతో విద్యా ర్థులకు మంచి మెసేజ్‌ను ఇస్తోందన్నారు. హాస్టళ్లలో ఫలితాలు మెరుగు పడాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలను ఉచితంగా కల్పిస్తున్నారని.. ప్రైవేటు పాఠశాలల్లో చేరి డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేసిన ఘనత నాటి ప్రధాని వాజ్‌పేయికి దక్కుతుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు.అవార్డులు పొందిన విద్యార్థులు మరింత మందికి స్ఫూర్తి దాయకంగా నిలవాలన్నారు.ఈ కార్యక్రమంలో జేసీ చిన్న రాముడు, కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత, డీఈవో కె.వాసుదేవరావు, ఆర్‌జేడీ జి.నాగమణి, ఆర్ఐవో నరసింహం,తల్లిదండ్రులు,టీచర్లు పాల్గొన్నారు.



తమ స్టార్స్ ఫొటోలు తీసుకుంటున్న తల్లులు


వినతుల రికార్డ్!



గత వారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ వద్ద అర్జీదారుల క్యూ(ఫైల్)

గత ఐదేళ్లూ ప్రజలు పరేషన్

- రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ
- ఉమ్మడి తూ.గో.జిల్లాలో ప్రజల క్యూ
- 1.27 లక్షల దరఖాస్తులు
- కొత్తకార్డులకు 10,555
- సభ్యులను చేర్చాలంటూ 97,886
- వైసీపీ పాలనలో నో ఛాన్స్
- ప్రస్తుత ప్రభుత్వంలో అవకాశం
- భారీగా వెల్లువెత్తుతున్న విజ్ఞప్తులు



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రేషన్‌కార్డులకు క్యూకడుతున్నారు.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవలే కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు ఆహ్వానించింది.ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల మంజూరు, అదనంగా కుటుంబ సభ్యులను చేర్చాలంటూ భారీగా దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎడాపెడా కార్డుల్లో కోత, అడ్డగోలుగా రద్దు.. కొత్తవారిని చేర్చకపోవడంతో వేలాది మంది నరకయాతన పడ్డారు.ప్రభుత్వం మారాక కార్డు దారులపై సీఎం చంద్రబాబు కరుణ చూపారు. ఆరేళ్ల తర్వాత అవకాశం దక్కడంతో జనం నుంచి భారీగా వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఏకంగా 1,27,533 మంది అర్జీలు పెట్టుకున్నారు. కొత్తకార్డులకు 10,555 మంది, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చాలంటూ 97,886 మంది విజ్ఞప్తులు చేశారు. అత్యధికంగా తూర్పు నుంచి 43,189 దరఖాస్తులు వచ్చాయి.

అప్పుడంతా అరాచకమే..

వైసీపీ ఐదేళ్ల పాలన..సంక్షేమ పథకాల అమల్లో కోతలే కోతలు అన్నట్టు సాగింది. రకరకాల నిబంధనలతో రేషన్ కార్డులను వేలల్లో ఏరేసింది. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 16.50 లక్షల రేషన్‌కార్డులుండగా అందులో తెల్లకార్డులు 15.69 లక్షలు ఉండేవి. వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించిన అప్పటి ప్రభుత్వం అమరావతి నుంచి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లా పౌరసరఫరాలశాఖకు పంపి గుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి అందరి కార్డులు రద్దు చేయాలని ఆదేశించింది. ప్రధానంగా 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో రద్దుచేశారు. వాస్తవానికి వీరంతా పొట్టకూటి కోసం హైదరాబాద్,విజయవాడ,చెన్నై,ఢిల్లీ తదితర ప్రాంతాలకు తాత్కాలిక వలస వెళ్లినవారే. ప్రజలు అప్పట్లో నిర్వహించిన స్పందనలో కార్డుల్లో మార్పులు చేర్పులు, కొత్తవి మంజూరు చేయాలంటూ అనేకసార్లు భారీగా వినతులు ఇచ్చారు.అయినా జగన్ సర్కారు చెవికెక్కించుకోలేదు. దీంతో అప్పట్లో ప్రతిపక్ష హోదాలో టీడీపీ ఆందోళన బాట పట్టింది. కార్డులను అడ్డగోలుగా ఏరివేయడంపై నిరసనలు చేపట్టింది. ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను గుర్తుంచుకుని పరిష్కారం కోసం ఆలోచించారు. పౌరసరఫరాలశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్డుల్లో మార్పులు,చేర్పులు చేపట్టడానికి పచ్చజెండా ఊపారు. గత నెల 14 నుంచి సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డులకు అర్జీలు స్వీకరిస్తున్నారు. రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులకు ఏడు రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.ఆరేళ్ల తర్వాత అవకాశం రావడంతో ప్రజలు క్యూకడుతున్నారు.

అత్యధికం అవే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకు 1,27,533 మంది నుంచి వినతులు వచ్చాయి.అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఎక్కువ.ప్రధానంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి అత్యధికంగా 43,189 అర్జీలు వచ్చాయి. వీటి లో రేషన్ కార్డుల్లో తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలంటూ 32,942 మంది మొర పెట్టుకున్నారు.బియ్యం కార్డులు విభజించాలంటూ 3,302 మంది, 3,684 మంది కొత్త కార్డులు కావాలని అర్జీలు అందించారు. కాకినాడ జిల్లాలో మొత్తం 42,805 మంది వినతులు అందించారు.ఇందులో కొత్తకార్డులు మంజూరు చేయాలని 3,526 మంది, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చాలని 32,852 మంది దరఖాస్తు చేసుకున్నారు. కోనసీమ జిల్లా లో మొత్తం 41,539 దరఖాస్తులు వచ్చాయి.వీటిలో అత్యధికంగా కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చాలని 32,092 మంది,కొత్త కార్డులకు 3,345 మంది దరఖాస్తులు చేశారు.ఇలా వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలన చేయనున్నారు. సచివాలయాల స్థాయిలో వీఆర్వోల నుంచి తహశీల్దార్ల వరకు ఆయా అర్జీలను విభాగాల వారీగా పరిశీలించి మార్పులు,చేర్పుల ప్రక్రియ చేపట్టనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు గడువు లేదని నిరంతరం కొనసాగిస్తామని కార్డుదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చే మాట చెప్పింది.

అర్జీ విభాగం	కాకినాడ	తూగోజీ	కోనసీమ
కార్డుల్లో చిరునామా మార్పు	1,447	1501	1387
ఆధార్‌సీడింగ్‌లో తప్పుల దిద్దుబాట్లు	368	387	356
కొత్తగా సభ్యులను చేర్చడం	32,852	32,942	32,092
కొత్తకార్డుల మంజూరు	3,526	3,684	3,345
కార్డుల తొలగింపు	1,294	1,348	1,154
బియ్యంకార్డుల విభజన	3,296	3,302	3,187
రేషన్‌కార్డుల సరెండర్	22	25	18
మొత్తం	42,805	43,189	41,539





డీవీఏపీ యూనిట్ ప్రారంభిస్తున్న మంత్రులు నిమ్మల, దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, నన్నయ వీసీ ప్రసన్నశ్రీ, వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

ఇన్నోవేటివ్‌గా ఆలోచించండి.. సమస్యలు పరిష్కరించండి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆదేశం

- డీవీఏపీ యూనిట్ ప్రారంభం
- వర్చువల్‌గా చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాపై సమీక్ష
- ప్రణాళిక రూపొందిస్తామన్న మంత్రి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి ఇన్నోవేటివ్‌గా ఆలోచించి సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుడదామని సీఎం చంద్రబాబు సూచించారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం తూర్పుగోదావరి జిల్లా స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయం (డీవీఏపీ యూనిట్)ను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో సమస్య ఉందని వాటన్నింటిని వెలికి తీయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో వనరులు సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. స్వర్ణాంధ్ర విజన్ -2047లక్ష్యాల సాధనలో భాగంగా ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రాధాన్యత అంశాలను ప్రాతిపదికగా తీసుకుని క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు చేయాలన్న సీఎం సూచనలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఎక్కడెక్కడ ఏ సమస్యలు ఉన్నాయో గుర్తించి తదనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విద్యార్థుల ద్వారా ప్రతిపాదించే నూతన ఆవిష్కరణలకు ఆర్థిక, సాంకేతిక చేయూతనిచ్చే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏపీ యువతకు వరం అన్నారు.రాజానగరంలో 300 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలం అందుబాటులో ఉందన్నారు.ఏపీలో పర్యాటకరంగ అభివృద్ధికి అవకాశం ఉందన్నారు.వీడియోకాన్ఫరెన్సలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు.

జిల్లా పీజీఆర్ఎస్‌లో 159 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన జీపీఆర్ఎస్‌లో 159 అర్జీలు స్వీకరించినట్టు జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పీజీఆర్ఎస్ నిర్వహించామన్నారు. ప్రజల సమస్యల పరిష్కార దిశలో మెరుగైన పనితీరు చూపాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ అంకితభావం, జవాబుదారి తనంతో సేవలందించాలన్నారు. అర్జీదారుల సంతృప్తే కొలమానంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చితమ సమస్యలను అధికారులకు అందించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 24 అర్జీలు

రాజమహేంద్రవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 24 అర్జీలను స్వీకరించి చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలు సమస్యలపై అక్కడికక్కడే స్టేషను బాధ్యులతో మాట్లాడి సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు,ఎస్‌టీ డీఎస్పీ సుబ్బరాజు పాల్గొన్నారు.

పోలీసులకు యోగా అవసరం : ఎస్పీ



రాజమహేంద్రవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో ఒత్తిడి,ఆందోళన నుంచి ఉపశమనం పొందవచ్చని ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ, పోలీసు అధికారులు, సిబ్బంది యోగా సాధన చేశారు.ఎస్పీ మాట్లాడుతూ యోగా అలవాటుగా చేసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు.వయసుతో నిమిత్తం లేకుండా యోగా సాధన చేస్తే ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవచ్చని చెప్పారు.యోగాకు నిత్యం అర గంట సమయాన్ని కేటాయించాలన్నారు. పోలీసు ఉద్యోగం నిత్యం ఒత్తిడితో కూడుకున్నదని, దానిని అధిగమించడానికి యోగా మంచి మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు, అర్జున్, చెంచి రెడ్డి, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ మాఫియాపై కదలిక

డీజిల్ మాఫియాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు..నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలోని బంకులో సోమవారం ప్రత్యక్ష తనిఖీలు చేపట్టారు.. నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు..

8



బంకులో ట్యాంకర్ పరిశీలిస్తున్న అధికారులు

11 నుంచి బస్‌పాస్‌లు జారీ

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జూన్ 11వ తేదీ నుంచి విద్యార్థులకు రాయితీతో కూడిన బస్ పాసులు జారీ చేయడం జరుగుతుందని ఆర్టీసీ జిల్లా అధికారి వై.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.2025-26 విద్యాసంవత్సరానికి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, గోకవరం, నిడదవోలు డిపోల్లో రోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ బస్సుపాసులు జారీ చేస్తారన్నారు.

రుడా వైస్ చైర్మన్‌గా జేసీ

రాజమహేంద్రవరం, జూన్9(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (రుడా) వైస్‌చైర్మన్‌గా జేసీ ఎస్. చిన్న రాముడు నియమితులయ్యారు. ఆయనకు పూర్తి అదనపు చార్జీని అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ ఇన్‌చార్జిగా ఉన్న సంగతి తెలిసిందే.

జిల్లా సహకార అధికారిగా వెంకటరమణ

జిల్లా సహకార అధికారిగా ఎం. వెంకటరమణ నియమితులయ్యారు. ఆయన ఇప్పటి వరకూ పల్నాడు జిల్లా నరసరావుపేట డీసీవోగా పనిచేస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఖాళీగా ఉండడంతో ఇక్కడకు బదిలీ చేశారు. రాజ మహేంద్రవరం మునిసిపల్ రీజియన్ డైరెక్టర్ పరిధిలో 71 మంది బదిలీ అయినట్టు ఆర్‌డీ నాగ నరసింహారావు తెలిపారు.

కొవ్వూరు ఏఎంసీ సెక్రటరీగా శ్రీనివాసరావు

కొవ్వూరు : కొవ్వూరు ఏఎంసీ సెక్రటరీగా ఎస్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన టి.శ్రీనివాసులు కరప ఏఎంసీ సెలక్షన్ గ్రేడు సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దుగ్గిరాల సెలక్షన్ గ్రేడు సెక్రటరీగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావు కొవ్వూరు బదిలీపై రానున్నారు.

ప్రభుత్వ బోధనాసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కెన్నడీ

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా న్యూరో విభాగం హెచ్‌వోడీ డాక్టర్ రాజశేఖర్ కెన్నడీ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ సోమవారం నుంచి 65 రోజులపాటు వ్యక్తిగత లాంగ్ లీవ్‌పై వెళ్లారు.డాక్టర్ కెన్నడీ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారని డీఎంఈ అధికారులు తెలిపారు.

దేవరపల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరం



దేవరపల్లిలో కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న అఖిర ఆసుపత్రి వైద్యాధికారులు

దేవరపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దేవర పల్లిలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ అన్నిఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అలాగే ఉద్యోగులు, హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నవారు, ఆరోగ్యశ్రీకార్డు ఉన్నవారికి ఉచితంగా వైద్య సదుపాయం కల్పిస్తున్నామన్నారు. రాజమండ్రికి చెందిన అఖిర ఆసుపత్రి కంటివైద్యుల ఆధ్వర్యంలో కంటిపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు పప్పు వెంకట రామారావు, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, గద్దే కృష్ణారావు, కేశిరాజు సీతారామయ్య, యలమటి సత్యనారాయణ, అఖిర ఆసుపత్రి వైద్యులు నారాయణరావు, వై.సాయిబాబు, నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ప్రేమ, సేవాభావం అవసరం



రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

దేవరపల్లి, జూన్9 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతిఒక్కరికీ ప్రేమ, సేవాభావం అవసరమని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బలుసు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. దేవరపల్లిలో సోమవారం సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద నుంచి గ్రామపురవీధుల గుండా ఆ యాత్ర సాగింది. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఐదు సత్యసాయి రథాలతో అన్నిగ్రామాల్లో రథయాత్రలు చేపడుతున్నట్టు చెప్పారు. సత్యసాయి సేవా కమిటీ నేతలు ఎంవీ సాయిరామ్, వీ.సుభాష్, శ్రీనివాసరాజు, బలుసు సత్యనారాయణ, సాయిబాబా ఆలయ అర్చకులు సత్యనారాయణ ఆచార్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ఆర్, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న రామతులసి

గోపాలపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి మీడియా విలేఖరులైన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. దీనిలో బాగంగా శ్రీనివాసరావు, కృష్ణంరాజు చిత్రపటాలను దహనం చేశారు. అనంతరం ఎస్ఐ మనోహర్‌కు ఫిర్యాదును అందజేశారు. అనంతరం రామతులసి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి, భారతిరెడ్డి కనీసం ఈ సంఘటనపై నోరు విప్పకపోవడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి



మోహనభారతికి వినతిపత్రం అందిస్తున్న వైఎస్ఆర్ కాలనీ వాసులు

తాళ్లపూడి, జూన్ 9 (తాళ్లపూడి): అన్నదేవరపేట పంచాయతీ పరిధి సూరయ్యపేట సమీపంలోని వైఎస్ఆర్ కాలనీలో వసతులు ఏర్పాటు చేయాలని సోమవారం ఆ కాలనీకి చెందినవారు తహశీల్దార్ మోహనభారతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ప్రతినెలా అందించే రేషన్‌ను తమ కాలనీలోనే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సరైన కాలువలు, రోడ్లు లేనందువల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో పిల్లి కృష్ణ, గేలి సత్యవతి, ఎస్కె రాఫూఫ్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా నీరాజనం

కొవ్వూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గోష్పాదక్షేత్రం ప్రధాన స్నానఘట్టంలో వేంచేసియున్న అఖండ గోదావరి మాతకు మంగళవారం 237వ మాసోత్సవ మహానీరాజనం అందజేస్తున్నట్లు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు తెలిపారు. జ్యేష్ఠ పూర్ణమిని పురస్కరించుకుని ప్రదోషకాలంలో మహా నీరాజనం, దీపోత్సవం సమర్పించడం జరుగుతుందన్నారు.

ప్రతి కోకో గింజనూ కొనుగోలు చేస్తాం

● కలెక్టర్ ప్రశాంతి



మద్దూరులో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, పక్కన ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ప్రతి కోకో గింజనూ కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. సోమవారం కొవ్వూరు మండలం మద్దూరు, నిడదవోలు మండలం కోరుమామిడిలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా గ్రామాల్లోని కోకో రైతులతో సమావేశమై మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న కోకో స్టాక్ వివరాలను సర్వే చేయడం జరుగుతుందన్నారు. అలాగే రెవిన్యూ, ఉద్యానవన అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కోకో రైతుల నుంచి వాస్తవ దిగుబడుల వివరాలను ఈ నెలాఖరులోగా సేకరించనున్నామన్నారు. కిలో రూ. 500 చొప్పున ధర చెల్లిస్తే, ప్రభుత్వం రూ. 50 కంపెనీలకు రీయంబర్స్‌మెంట్ చేస్తుందన్నారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి బి. సుజాత కుమారి, కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత, ఏపీఎంఐపీ పీడీ ఏ. దుర్గేష్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఉద్యానవన అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, రెవిన్యూ, ఉద్యానవన శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 15 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో డా. రాణీసుస్మిత ఆదేశించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొని ప్రజల నుంచి మొత్తం 15 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే టోల్‌ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్‌చేసి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

యోగాంధ్ర అవగాహన ర్యాలీలు



కొవ్వూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాను నిత్యక్రియలో భాగం చేసుకోవడం వల్ల మంచి ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం ప్రాంగణంలోని సంస్కృత కళాశాలలో సోమవారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా శిక్షకురాలు పెనుమత్స సరోజిని యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు వేయించారు. అనంతరం ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం నుంచి విజయవిహార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఈనెల 14, 18, 21 తేదీల్లో గోష్పాదక్షేత్రంలో మాస్ యోగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యోగా సాధన చేస్తే ఒత్తిడిని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సూరపనేని చిన్ని, మున్సిపల్, సచివాలయం, మెప్మా, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: యోగాపై విశేష ప్రచారం కల్పించేందుకు చేపట్టిన యోగాంధ్ర ర్యాలీకి విశేష స్పందన లభించడం ఆనందదాయకమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని గణపతి సెంటర్ నుంచి గణేష్‌చౌక్ సెంటర్ వరకు మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాల మేరకు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ యోగా ప్రాముఖ్యత ప్రజలందరికీ తెలిసేలా చేయడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ప్రజలు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో యోగా చేయండి.. ఆరోగ్యంగా ఉండండి అంటూ పలు రకాల నినాదాలు చేశారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, మానవహారాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కె. ఆంజనేయ శర్మ, ఏఈలు బి. ఏడుకొండలు, భవాని, ఎన్. ఏడుకొండలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు , తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరపల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. దేవరపల్లిలో సోమవారం వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. స్థానిక బస్టాండ్ వద్ద నుంచి గోపాలపురం మూడురోడ్ల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, విద్యా శాఖ ఏఈ సీహెచ్ వెంకట్రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు ఉప్పులూరి రాంబాబు, వీఆర్వోలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, ఉపాధి హామీ శ్రామికులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

చాగల్లు: యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం మండల కేంద్రమైన చాగల్లులో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెరుగైన ఆరోగ్యం కోసం అందరూ యోగాపై అవగాహన కలిగి ఉండాలని నినాదాలు చేశారు. ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, తహశీల్దార్ ఎం. మెరికమ్మ, తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం యోగాను ప్రతిష్ఠాత్మకంగా భావించి ప్రజలకు అవగాహన కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. యోగా చేద్దాం, ఆరోగ్యంగా ఉందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో ...



దేవరపల్లిలో...



నిడదవోలులో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

దొంగతనాలకు పాల్పడిన ఇద్దరి అరెస్టు

● 125 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం

కొవ్వూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టుచేసి 125 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరురూరల్ సీఐ కె. విజయబాబు తెలిపారు. కొవ్వూరు సర్కిల్ పరిధిలో జరుగుతన్న వరుస దొంగతనాల నేపథ్యంలో జిల్లా నరసింహకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ జి. దేవకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. సోమవారం కొవ్వూరు, ఏలూరు రోడ్‌లో పంగిడి, రిలయన్స్ పెట్రోల్‌బంకు వద్ద పోలీసుల వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఇందులో దేవరపల్లి నుంచి కొవ్వూరు వైపు వస్తున్న తెలుపు రంగు మారుతీ బాలెనో కారు పోలీసులను చూసి స్పీడుగా వెళ్తుండగా ఆపి తనిఖీ చేశారు. అందులో ప్రయాణిస్తున్న నెల్లూరు జిల్లా బోగల్ మండలం బిట్రగుంటకు చెందిన మారుబోయిన మాల్యాద్రి, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం పంచాయతీకి చెందిన తోటకూర రామకృష్ణంరాజును అదుపులోకి తీసుకుని విచారించగా కొవ్వూరురూరల్‌లో 2, సమిశ్రగూడెంలోఒకటి, తాళ్లపూడిలో ఒకటి మొత్తం నాలుగు దొంగతనాలకు పాల్పడినట్టు తెలిపారు. దీంతో ఇద్దరిని అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ. 10 లక్షలు విలువైన 125 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు దొంగతనాలకు పాల్పడిన 3వ వ్యక్తి నరసాపురంకు చెందిన సద్దుల కుమార్‌రాజా పరారీలో ఉన్నాడన్నారు. ఈ కేసును ఛేదించడంలో డీఎస్పీ జి. దేవకుమార్, రూరల్ సీఐ కె.విజయబాబు, రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు, క్రైమ్ ఎస్ఐ పి. రవీంద్రబాబు, రాజమహేంద్రవరం ఐటీ కోర్ టీమ్ అయ్యప్పరెడ్డి, సిబ్బంది జీవీఎస్వీ అనిల్‌కుమార్, అఫ్సరీ బేగ్, రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారన్నారు.

సాంకేతిక సమస్యతో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నిడదవోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బసివిరెడ్డిపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య కారణంగా సోమవారం మంటలు చెలరేగాయి. దీంతో దీని చుట్టుపక్కల ఉన్న గడ్డి, చెట్లు కాలిపోయాయి. దీనిపైసమాచారం అందుకున్నసహాయ జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కె.శ్రీనివాసరావు తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 30 వేల ఆస్తినష్టం జరిగినట్టు అధికారులు ధ్రువీకరించారు.

100 పడకల ఆసుపత్రికి కృషి చేస్తా : ఎమ్మెల్యే



ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

కొవ్వూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణానికి చెందిన రాజ్యసభ సభ్యుడు కోడూరి విజయేంద్ర ప్రసాద్ మం జూరు చేసిన రూ. 50 లక్షల నిధులతో ఆసుపత్రి ప్రాంగణంలో ఓపీ షెడ్డు, కిచెన్, డైనింగ్ షెడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మా ట్లాడుతూ ఈ ప్రభుత్వ ఆసుపత్రి కొవిడ్ సమయంలో 50 పడకల ఆసుపత్రిగా ఉండటంతో పాటు వైద్యులు, భవనాలు, వైద్య పరికరాల కొరత వంటి సమస్యలు వేధించడంతో ఇక్కడకి వచ్చిన రోగులను రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రి, తాడేపల్లిగూడెం ఆసుపత్రులకు పం పించాల్సి వచ్చిందన్నారు. 100 పడకల ఆసు పత్రి చేయాలని డిమాండ్ ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ విషయమై సీఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతిపత్రాలు అం దించామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కినాగేంద్ర, పిల్లలమర్రి మురళీకృష్ణ, డేగల రాము, పాకా జయరామ్, జొన్నలగడ్డ శ్రీనివాస్, మద్దిపాటి మురళీ, మద్దుల సత్యనారాయణ, అనపర్తి గోపాలకృష్ణ, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు, కుప్పాల ప్రసాద్, నాయుడు వెంకటేశ్వరరావు, మారిశెట్టి సతీష్, మద్దిపాటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తొలగించిన ఉక్కు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక సభ్యులు

కొవ్వూరు, జూన్9 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన 5,400 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందరబాబు డిమాండ్ చేశారు. సోమవారం కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సుందరబాబు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దని, సొంత గనులు కేటాయించాలని కోరుతూ అఖిలపక్ష కార్మికసంఘాల ఆధ్వర్యంలో 1578 రోజులుగా నిరసన శిబిరం కొనసాగుతోందన్నారు. లోకేష్ యువగళంలో, ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. మద్దుకూరి దొరయ్య, మాణికిరెడ్డి హరిబాబు, కృష్ణ, బీర రవి, కార్మికులు పాల్గొన్నారు.

గోదావరి ఏటిగట్టుపై సుందరీకరణ పనులు చేపట్టాలి

కొవ్వూరు, జూన్9 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోదావరి ఏటిగట్టుపై సుందరీకరణ పనులు చేపట్టాలని సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అం దజేశారు. సీపీఎం నేత పడాల గంగాధరరావు మాట్లాడుతూ గోష్పాదక్షేత్రంలోని గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే మహిళలకు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు, మరుగుదొడ్లు, యాత్రికులకు తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో దగ్గు రాధాకృష్ణ, ఎం. జ్యోతిబసు, తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ మాఫియాపై కదలిక



నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో బంకు లీజుదారుడు వీరబాబు నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

● బయో డీజిల్ బంకులో అధికారుల దాడులు

● ప్రధాన పాత్రధారుడు వైసీపీ నాయకుడే ..

● 'ఆంధ్రజ్యోతి' కథనంతో వెలుగులోకి ... పురుషోత్తపల్లి బంకులో తనిఖీలు

నిడదవోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న డీజిల్ మాఫియాపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. పొరుగు రాష్ట్రాల నుంచి దొడ్డిదారిన తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమ మార్గాల్లో బంకులకు చేర్చి, అక్కడ నుంచి ప్రముఖ కార్పొరేట్ కంపెనీ హెచ్‌పీ లోగోను అడ్డం పెట్టుకుని అనుమతుల్లేని వాహనాల్లో జిల్లాలోని ఇసుక ర్యాంపులు, లారీ స్టాండులో ఉన్న వాహనాలకు డీజిల్‌ను సరఫరా చేసేస్తున్నారు. ఈ మాఫియా వెనుక ముఖ్యపాత్ర, సూత్రదారి వైసీపీ నేత కావడం గమనార్హం. వివరాల్లోకి వెళితే నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఒక బయోడీజిల్ బంకును జగ్గంపేట సమీపంలోని ఒక గ్రామానికి చెందిన వైసీపీ నేత వీరబాబు లీజుకు తీసుకుని ఈ డీజిల్ మాఫియాకు తెరలేపాడు. బయో డీజిల్ పేరుతో ఉన్న బంకులో నుంచి పొరుగు రాష్ట్రాల నుంచి దొడ్డిదారిన డీజిల్, క్రూడ్ ఆయిల్ లాంటివి తెప్పించి ప్రముఖ ఆయిల్ కంపెనీ హెచ్‌పీ పేరుతో స్టిక్కరింగ్ చేయించి సుమారు 3000 లీటర్ల కెపాసిటీ కలిగిన ట్యాం కును బొలేరో వాహనానికి అమర్చి ట్యాంకుకు డిజిటల్ ఎక్విప్‌మెంట్‌తో పాటుగా డీజిల్ కొట్టేందుకు గన్‌ను ఏర్పాటు చేసి ఈ మాఫియా సాగిస్తున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' బట్టబ యలు చేసింది. దీనిపై అధికారులు స్పందించి సోమవారం బంకుపై దాడులు నిర్వహించారు. డివిజినల్ ఏఎస్‌వో నాగాంజనేయులు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బంకు లీజుదారుడు వీరబాబు ఆధ్వర్యంలోనే తాళాలు వేసి వున్న బంకును తెరిపించి రికార్డులను పరిశీలించడంతో పాటు ఆయిల్ శాంపిల్స్‌ను సేకరించారు. దీనిపై పూర్తి నివేదికను జేసీ చినరాముడుకు అందిస్తామని తెలిపారు. ఈ దాడుల్లో రాజానగరం రంగంపేట సివిల్ సప్లయిస్ తహశీల్దార్ బాపిరాజు, పెరవలి సివిల్ సప్లయిస్ తహశీల్దార్ సుధీర్ రెడ్డి, నిడదవోలు సివిల్ సప్లయిస్ తహశీల్దార్ అనిల్ కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యేంద్ర, వీఆర్ వోలు సునీల్, రాంబాబు పాల్గొన్నారు.

● కొవ్వూరు డివిజన్ ఏఎస్‌వో నాగాంజనేయులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ బయో డీజిల్ బంకులో భూమిపైన ఉన్న ఒక ట్యాం కులో నుంచి భూమిలోపల ఉన్న మరో ట్యాంకు నుంచి ఆయిల్ శాంపిల్స్ సేకరించామని, వీటిని విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి డీజిలో, బయోడీజిలో నిర్ధారణ చేసుకుని తదు పరి చర్యలు తీసుకుంటా మని తెలిపారు. అలాగే హెచ్‌పీ కంపెనీ పేరుతో అనుమతులు లేకుండా బంకు లీజుదారుడు వీరబాబు తిప్పు తున్న వాహనాన్ని గుర్తించేందుకు కూడా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బదిలీపై 43 మంది సబ్జెక్టు ఉపాధ్యాయుల రాక

దేవరపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల టీచర్ల బదిలీల్లో భాగంగా సోమవారం మండలానికి సంబంధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 43 మంది సబ్జెక్టు టీచర్లు బదిలీపై వచ్చారు. ఇందులో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా 10 మంది నూతనంగా మండలంలోని పలు పాఠశాలల్లో చేరినట్టు ఎంఈవోలు ఎం.తిరుమలదాసు, కేఆర్ఎస్ ఎస్వీ అప్పారావు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా సిరా రాజు

నల్లజర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా సిరా రాజు, ప్రధాన కార్యదర్శిగా మర్రి రమేష్‌ను ఎంపిక చేసినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కండెల్లి శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.